epaper.telugurekhamedia.com
TELUGU REKHA TELUGU DAILY

# తెలుగు రేఖ

సంపుటి : 01 సంచిక : 199 పేజీలు : 4 వెల : రూ. 2.00
తెలుగు దినపత్రిక

బుధవారం 24 సెప్టెంబర్ 2025 | తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ | RNI No.TELTEL/2010/31853




### కుంభమేలా చేసుకున్న పుణ్యమేంది

# మేడారం చేసుకున్న పాపమేంది



"ఆదివాసీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కుంభమేళాకు రూ.వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసుల కుంభమేళా 'మేడారం జాతర'కు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఈ జాతరకు జాతీయ హోదా గుర్తింపు ఇవ్వాలని, ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్న అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటు-చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు."

- కేంద్రానికి సిఎం రేవంత్ డిమాండ్
- మేడారం సందర్శన..అభివృద్ధి పనులపై సమీక్ష
- జాతర లోగా పనుల పూర్తికి ఆదేశాలు
- గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు
- నిలువెత్తు బంగారం సమర్పించిన రేవంత్ రెడ్డి

**ఆదివాసీ జాతరకు కేంద్రం నిధులు ఇవ్వాల్సిందే**

**ములుగు,సెప్టెంబర్23(తెలుగు రేఖ):** ఆలయ అభివృద్ధి బాధ్యతతో కూడిన భావోద్వేగమని పేర్కొన్నారు. ఈ పనులతో మంత్రి సీతక్కతోపాటు- తన జన్మ ధన్యమైనట్లేనన్నారు. సమ్మక్క- సారలమ్మ ఆశీస్సులతో 2023 ఫిబ్రవరి 6న ఇక్కడినుంచే పాదయాత్ర మొదలు పెట్టా. తెలంగాణకు పట్టిన చీడపీడలను వదిలించేందుకు ఈ గడ్డపై



నుంచి అడుగులు వేశాం. ఆనాడు పాలకులు సమ్మక్క - సారలమ్మ ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపారు. కానీ, మా ప్రభుత్వం ఎన్ని రూ.కోట్లయినా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఆదివాసులను, పూజారులను, సంప్రదాయ కుటుంబాలను ఇందులో భాగస్వాములను చేస్తున్నాం అని అన్నారు. సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. స్థానికుల అభిప్రాయాలు తెలుసుకొనేందుకే ఇక్కడికి వచ్చానని వివరించారు. 100 రోజుల్లో పనులు పూర్తయ్యేలా అధికారులు చూడాలి. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించాం. ప్రకృతి





మిగతా 2లో..

## జీఎస్టీపై ఎనిమిదేళ్లుగా దోపిడీ

### ఇప్పుడేమో సంబరాలా: పొన్నం ఆగ్రహం



**హైదరాబాద్,సెప్టెంబర్23 (తెలుగు రేఖ):**జీఎస్టీ విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. దేశ ప్రజలను దోచుకునేందుకే నాడు జీఎస్టీని ఆయుధంగా వాడారని, వాళ్లే పన్నులు వేసి, వాళ్లే తగ్గించి, ఇప్పుడు వాళ్లే సంబురాలు చేసుకుంటున్నారని దీనిని మించిన మూర్ఖత్వం మరొకటి ఉండదని ఆయన దుయ్యబట్టారు. మంగళవారం గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ 8 ఏళ్లుగా జీఎస్టీ పేరుతో పేదల రక్తం తాగి ఇప్పుడు పేదలకు లబ్ధి చేసినట్టు- బిజెపి నాయకులు బిల్డప్ ఇస్తున్నారని ఆయన ఫైర్ అయ్యారు. జీఎస్టీ తగ్గింపు అంత ఎన్నికల డ్రామా అని, ఇంకా జీఎస్టీ ఫలాలు పేదోడికి అందలేదన్నారు.

## నల్గొండ ఎప్పటికీ కాంగ్రెస్ అడ్డానే

- కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం: కోమటిరెడ్డి



**నల్లగొండ,సెప్టెంబర్23(తెలుగు రేఖ):** బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలయ్యిం దని..అది మునిగిపోయే నావ అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్గొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఆయన.. నల్గొండ జిల్లాలో ఓ నాయకుడు ఉన్నాడు.. ఎప్పుడూ గెలిచిన రెండు వేల లోపు మెజార్టీనే ఇక మళ్ళీ గెలవడని జగదీష్ రెడ్డిని ఉద్దేశించి సెటైర్ వేశారు. నల్గొండ గడ్డ కాంగ్రెస్ పార్టీకి అడ్డా అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.. కాంగ్రెస్ కండువా మోసే నిఖార్సైన కార్యకర్తలే పార్టీకి బలం అని చెప్పారు.

మిగతా 2లో..

## కెసిఆర్ కుటుంబ జల్సాలకు

# రాష్ట్రం తాకట్టు



- లక్షల కోట్లు అప్పులు చేసి ఆగం చేసారు
- మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**ఖమ్మం,సెప్టెంబర్23 (తెలుగురేఖ):** రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి తెచ్చిన ఏడున్నర లక్షల కోట్ల అప్పులు ఏమయ్యాయని ప్రశ్నిస్తే.. పదేండ్లు పరిపాలించిన నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలు నిలదీస్తే సమాధానం చెప్పడం లదన్నరు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తాయని భావించి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ కుటుంబం చేతిలో పదేండ్లు తెలంగాణ బందీ అయ్యిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో నెలకు 11 వేల కోట్ల వడ్డీలు కడుతు న్నామని, గత పాలకులు చేసిన 26 వేల కోట్ల అప్పుకు 11.50 శాతం ఉన్న వడ్డీని 8 శాతానికి తగ్గించామని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం క్యాబినెట్ పనిచేస్తున్న తీరును చూసి రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ లో చేరుతున్నారని తెలిపారు.ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జిల్లా నాయకులే కాదు.. ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ లో చేరడానికి వస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని, వారి కుటుంబ అవసరాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు- పెట్టారని

మిగతా 2లో..

## నెలల తరబడి పెండింగ్‌లో రేషన్ కమీషన్

- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్,సెప్టెంబర్23 (తెలుగురేఖ):**నెల తరబడి రేషన్ కమీషన్ చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్ల జీవితాలతో చెలగాటం ఆడటం దుర్మార్గం అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు మండిపడ్డారు. పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ, వారి ఆకలి తీర్చుతున్న రేషన్ డీలర్లకు.. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల తీరుతో పస్తులుండే పరిస్థితి రావడం శోచనీయం అని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్

మిగతా 2లో..

## వరంగల్‌లో కొత్తగా వెల్‌నెస్ సెంటర్

### ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,సెప్టెంబర్23 (తెలుగురేఖ):** వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వం సైన్యాధారిత ఉద్యోగులు, పింఛన్ పొందే పౌరులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందిం చడానికి కొత్త సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ వెల్‌నెస్ సెంటర్ ని ఆమోదించింది. ఈ సౌకర్యం ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్‌లకు ఉపయోగపడనుంది. అయితే, సీజీఎచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రాథమిక క్షుఉ చికిత్సలు సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉం టాయి. నరేంద్ర మోడీ నాయకత్వంలో

మిగతా 2లో..

## కెటిఆర్‌కు అరుదైన గౌరవం

- తాల్ హాస్పిటల్స్ హెల్త్‌ఫెస్ట్ 2025కు ఆహ్వానం



**హైదరాబాద్,సెప్టెంబర్23 (తెలుగురేఖ):**తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, సిరి సిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలో జరగ నున్న ప్రతిష్టాత్మక 'తాల్ హాస్పి టల్స్ హెల్త్‌ఫెస్ట్ 2025' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానం అం దింది. ఈ ఆహ్వా నాన్ని తాల్ హాస్పిటల్స్ సీఈఓ శ్రీ సాయి గుండ'వెల్లి హైదరాబాద్‌లో కేటీ ఆర్‌కు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్శిటీ- మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్ కూడా గుండవెల్లి వెంట ఉన్నారు. అక్టోబర్ 24న కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ- ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో లో ఈ 'హెల్త్‌ఫెస్ట్ 2025' నిర్వహిం చనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య నిపుణులు, విధాన నిర్ణేతలు, ఆవిష్క ర్తలు, మార్పు తీసుకొచ్చేవారిని ఒకే

మిగతా 2లో..

## ఆరోగ్యాంధ్రప్రదేశ్ మనందరి లక్ష్యం

- ఆరోగ్యం కాపాడుకోవడం అతి ముఖ్యం
- ఏపీలో 98 శాతం ఆస్పత్రుల్లోనే ప్రసవాలు
- సిజేరియన్ల నిరోధానికి తక్షణ చర్యలు
- అసెంబ్లీలో వైద్యారోగ్యశాఖపై చర్చలో సిఎం చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్23 (తెలుగురేఖ):**ఆరోగ్యఆంధ్రప్రదేశ్ మనం దరి ఆకాంక్ష అని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అసెం బ్లీలో మంగళ వారం వైద్యా, ఆరోగ్య శాఖ పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్ర బాబు మాట్లాడారు. 2026 నాటికి ఏపీలో 5.37 కోట్ల మంది జనాభా ఉంటారని వెల్లడించారు. 2047 నాటికి భారత్ జనాభా 162 కోట్లు దాటుతుందని చెప్పు కొచ్చారు సీఎం చంద్రబాబు. 2047 నాటికి చైనా జనాభా 100 కోట్లే ఉం టుందని తెలిపారు. ఆరోగ్యం కాపాడు కోవడం అతి ముఖ్యమని సూచించారు. దక్షిణాదిలో



మిగతా 2లో..

## కామారెడ్డి వరద నష్టంపై రీ సర్వే చేయాలి

- సాయం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన
- కేంద్రం ఇచ్చిన నిధులనే వాడుకుంటున్న రాష్ట్రం
- మీడియా సమావేశంలో మండిపడ్డ ఎంపి అర్వింద్



మిగతా 2లో..

**నిజామాబాద్,సెప్టెంబర్23 (తెలుగురేఖ):** కామారెడ్డిలో వరద నష్టం అంచనాపై రీ సర్వే చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సూచించారు.

## జీఎస్టీ తగ్గింపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మేలు

**ఆదిలాబాద్ (తెలుగు రేఖ) సెప్టెంబర్ 23:**

సామాన్య మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా భాజపా ప్రభుత్వం జీఎస్టీ లో సమూల మార్పులను తీసుకొచ్చిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు మంగళవారం ఏమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు గతంలో ఉన్న నాలుగు స్లాబ్ లను రెండు స్లాబ్ లకు తీసుకొని రావడం అందులోనూ సామాన్యులు మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే అనేక వస్తువుల్లో టాక్సు తొలగించడం కొన్ని వస్తువులకు 05. శాతం కుదించడం వల్ల పేదలకు మేలు జరిగిందని ఆయన అన్నారు వస్తువుల ధరలు తగ్గడం వల్ల కొనుగోలు సామర్థ్యం పెరుగుతుందన్నారు తెలంగాణ రాష్ట్రంలో 3.25 కోట్ల మందికి ప్రయోజనం చేకూరడంతో పాటు 35 నుంచి 40 వేల కోట్లు ఆదా అవుతుంది అని ఆయన తెలిపారు నరేంద్ర మోడీ ప్రధానమంత్రి పదవి చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు పార్లమెంట్లో తీసుకునే నిర్ణయాలతో దేశం అన్ని రంగాల అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు మేలు జరుగుతుంటే కొన్ని పార్టీలు గగ్గోలు పెడుతున్నాయని రాష్ట్రాల ఆదాయం తగ్గుతుందని రాద్ధాంతం చేస్తున్నారు జీఎస్టీ ని సరళీకృతం చేస్తున్న సమయంలో ధరలు పెరిగాయని విమర్శించిన పార్టీలే నేడు మరోలా అంటున్నాయని ఆయన అన్నారు ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సామాగ్రి ధరలు తగ్గడం వల్ల పేదలకు వ్యవసాయ రంగంలో రైతులు ఉపయోగించే పనిముట్ల ధరలు తగ్గడం వల్ల అనేకమంది రైతులకు ప్రయోజనం చేకూరిందని ఆయన అన్నారు ప్రపంచంలోని పలు దేశాలు ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ప్రధానమంత్రి పేదల సంక్షేమమే లక్ష్యంగా ధరలు తగ్గింపును చేపట్టడం అభినందనీయమని ఆయన అన్నారు జీఎస్టీ వల్ల కలిగిన ప్రయోజనాలను భాజపా కార్యకర్తలతో పాటు వ్యాపారవేత్తలు ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు.. విరుతోపాటు బిజెపి నాయకులు దినేష్ మాటోలియా. గటీకా క్రాంతి. ఆకుల ప్రవీణ్. వేద వ్యాస్. రాకేష్. గంగాధర్. భీమ్సేన్ రెడ్డి. సూర్య కిరణ్ .నగేష్ రెడ్డి మోహన్ అగర్వాల్. కృష్ణ తదితరులు ఉన్నారు

## అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోతు సౌమ్యను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ **(తెలుగు రేఖ)** సెప్టెంబర్ 23:

అంతర్జాతీయ ఫుట్ బాల్ క్రీడాకారిణి గూగులోతు సౌమ్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. యువజన, స్పోర్ట్స్ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి మంగళ వారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా క్రీడాకారిణి సౌమ్యని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాలువాతో సన్మానించడం జరిగింది. ఇటీవల అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య నుంచి ఉత్తమ క్రీడాకారుణి అవార్డు, మెడల్స్ ను ముఖ్యమంత్రికి చూపించగా ఫుట్‌బాల్ లో సౌమ్య కనబర్చిన విశిష్ట ప్రతిభను చూపించిన అభినందించారు. ఈ మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్నస్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి , స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియే షన్ అధ్యక్షులు డా.మోహమ్మద్ అలీ రఫాత్, ప్రధాన కార్యదర్శి పాల్గుణ పాల్గొన్నారు

## కెసిఆర్ కుటుంబ జల్సాలకు రాష్ట్రం తాకట్టు

మండిపడ్డారు. అప్పుల భారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకు ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రిని పలుమార్లు కలిశామని చెప్పారు. రాష్ట్ర ప్రజలు ఉప్పు, పప్పు ఏది కొనుగోలు చేసినా పన్ను చెల్లిస్తున్నారని, ఆ పన్నులతోనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ఖజానాలోని ప్రతి పైసాకు అధికారులు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ఉద్యోగులు సకల జనుల సమ్మె చేసి ప్రత్యేక రాష్ట్రం కోసం కృషి చేస్తే గత పాలకులు ఉద్యోగులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల బకాయిలు చెల్లించలేదని వెల్లడించారు. తమప్రభుత్వం రాగానే నెలకు రూ.700 కోట్ల చొప్పున ఉద్యోగుల బకాయిలు చెల్లించుకుంటూ వస్తున్నామని వివరించారు. పదేండ్లలో రాష్ట్రంలో ఒక బడి, రోడ్డు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ప్రజలకు దక్కలేదన్నారు. గోదావరిపై లక్ష కోట్లు- అప్పు తెచ్చి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని వివరించారు.

## గ్రూప్-1 రద్దుపై మరో అప్పీల్

**హైదరాబాద్,సెప్టెంబర్23(తెలుగు రేఖ):** తెలంగాణలో గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను రద్దు చేస్తూ ఇటీవల వెలువడిన తీర్పుపై హైకోర్టులో మరో అప్పీల్ దాఖలైంది. గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి ఒకరు ఈ అప్పీల్ దాఖలు చేశారు. జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సదరు అభ్యర్థి అప్పీల్‌ను సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది. టీజీపీఎస్సీ కూడా అప్పీల్ దాఖలు చేశారని న్యాయవాది పేర్కొనగా.. ఈ రెండు పిటిషన్లు కలిపి బుధవారం విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. గ్రూప్-1 మెయిన్ పత్రాల పునర్ మూల్యాంకనం చేయాలంటూ గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. టీ-జీపీఎస్సీ విడుదల చేసిన ర్యాంకుల లిస్టు రద్దు చేసిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు.. ఎనిమిది నెలల్లో మెయిన్స్ పత్రాల పునర్మూల్యాంకనం చేయాలని టీ-జీపీఎస్సీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఒకవేళ ఎనిమిది నెలల్లో ప్రక్రియ పూర్తి చేయపోతే మెయిన్స్ మళ్లీ నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది.

## కెటిఆర్‌కు అరుదైన గౌరవం

వేదికపైకి తీసుకువచ్చి, భవిష్యత్ ఆరోగ్య సంరక్షణపై చర్చించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యక్తిగత వైద్యం, డిజిటల్ హెల్త్‌కేర్ ఆవిష్కరణలు, సమీకృత వైద్య సం రక్షణ, ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఆరోగ్య సేవలకు మార్గాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో కేటీ-ఆర్ కీలకోపన్యాసం ఇవ్వనున్నారు. తెలంగాణలో -టె-క్నాలజీ ఆధారిత పాలన, ఆవిష్కరణలతో కూడిన అభివృద్ధి, ఆరోగ్య రంగంలో తీసుకువచ్చిన విధానాలు ప్రపంచ ప్రజలకు ఎంతో విలువైనవిగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఆహ్వానాన్ని కేటీఆర్ అంగీకరించినందుకు టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ ధన్యవాదాలు తెలిపింది. హెల్త్‌ఫెస్ట్ 2025లో ఆయన భాగస్వామ్యం ఈ వేదికపై అర్థవంతమైన చర్చలకు దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నల్గొండ ఎప్పటికీ కాంగ్రెస్ అడ్డానే

30 ఏళ్లుగా తనను అక్కున చేరుకున్న కార్యకర్తలకు ఏమిచ్చినా ఋణం తీర్చుకో లేనన్నారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేర్చే బాధ్యత కార్యకర్తల దేనని చెప్పారు. గ్రామీణ రోడ్లు అన్ని డబుల్ రోడ్లుగా మారుస్తా. విద్యా,వైద్యంలో ఇంకా మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా వంద శాతం కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడాలని చెప్పారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

## వరంగల్‌లో కొత్తగా వెల్‌నెస్ సెంటర్

ఈ కార్యక్రమం ప్రారంభించడం, ఉద్యోగుల సంక్షేమం, సామూహిక ఆరోగ్య పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను మళ్ళీ ప్రస్తావిస్తుంది. ఇది 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' దార్శనికతకు సాక్ష్యంగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వరంగల్‌లో కొత్త వెల్‌నెస్ సెంటర్ ఆమోదం పొందిన విషయాన్ని ఎక్స్ లో పోస్ట్ చేశారు కిషన్ రెడ్డి. ఈ కొత్త సౌకర్యం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుండటం, ప్రాంతీయ ఆరోగ్య రంగానికి కీలక చొరవగా ఉంటుంది.

## జిఎస్టీ అమలను పర్యవేక్షిస్తున్నాం

**- అమలు చేయని వారి వివరాలు ఆరా**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్23(తెలుగు రేఖ):** జీఎస్‌టీ- సంస్కరణలు అమల్లోకి రావడంతో నిత్యావసరాల నుంచి కార్ల వరకు పన్నుల భారం తగ్గి, కొనుగోలుదార్లకు భారీగా సొమ్ము ఆదా కానుంది. జీఎస్టీ 2.0 అమల్లోకి వచ్చినప్పటికీ కొన్ని ఈ-కామర్స్ వేదికలు ఆ ప్రయోజనాలను బదిలీ చేయడం లేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. ఈ ఫిర్యాదులపై ఆరా తీస్తున్నట్లు- వెల్లడించాయి. ధరల మార్పును పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఫిర్యాదులపై ఇప్పుడే స్పందించలేం. సెప్టెంబర్ 30లోగా క్షేత్రస్థాయిలో జీఎస్టీ అమలుపై నివేదిక అందనుందని పేర్కొన్నాయి. జీఎస్టీ 2.0 సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. దాంతో కిరాణా సరకులపై కుటుంబ ఖర్చులు 13శాతం తగ్గనుండగా, ఒక చిన్న కారు కొనుగోలు చేస్తే దాదాపు రూ.70,000 వరకు ఆదా కానుంది.

## కుంభమేలా చేసుకున్న పుణ్యమేంది

# మేడారం చేసుకున్న పాపమేంది

**(మొదటి పేజీ తరువాయి..)**

వైపరీత్యాలను తట్టుకొనేలా నిర్మాణాల రూపకల్పన చేశాం. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. రాబోయే వంద రోజుల్లో నిష్ఠతో పనులు పూర్తి చేయాలి. రాతి కట్టడాలే నిర్మిస్తాం. మహా జాతర నాటికి పనులు పూర్తి చేస్తాం. స్థానికుల భాగస్వామ్యం, సహకారంతోనే ఇది సాధ్యం. మహా జాతరకు మళ్లీ వస్తా. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు మేడారం ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో భాగంగా పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను సీఎం రేవంత్ తెలుసుకున్నారు. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు. ఆ అమ్మవార్ల ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడింది. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి వనదేవతలను సందర్శిస్తున్నా. ప్రకృతి వైపరీత్యాలనూ తట్టు-కునేలా శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే మా అభిమతం. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించేలా పనిచేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళికలు, డిజైన్‌లను అధికారులు పూజారులకు, ఆదివాసీ సంఘాలకు వివరించారు. ఈ ప్రణాళికలపై ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకున్న సీఎం, వారి ఏకాభిప్రాయం పొందిన తర్వాతనే పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీల సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు- స్పష్టం చేశారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, వారి సంప్రదాయాలు, విశ్వాసాలను



పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని.. వారి సంప్రదాయంలో ఏమాత్రం మార్పు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధిని డబ్బులతో కాకుండా భక్తితో చూడాలని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా పనులు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని, పనులను పూర్తి చేసే బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. జంపన్న వాగులో నీరు నిల్వ ఉండేలా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఇంకా ఆలయ అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు- చేయాలని కూడా సూచించారు. తన రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్ని-కై-నప్పటి నుంచి అమ్మవార్లను దర్శించుకుంటున్నానని అమ్మవార్ల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు.

ఆదివాసీల పోరాటానికి సమ్మక్క, సారలమ్మలు స్ఫూర్తి అని కొనియాడారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని పేర్కొంటూ, వారి సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఏ సంక్షేమ పథకం అయినా ఆదివాసీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నామని అన్నారు. సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణం మా జీవితంలో గొప్ప ఘట్టం. ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ప్రభుత్వం మంజూరు చేసేందుకు సిద్ధం. ఈ కార్యక్రమంలో ఆదివాసీలు, పూజారులు, సంప్రదాయ కుటుంబాలందరినీ భాగస్వాములను చేస్తున్నాం అని స్పష్టం చేశారు. మహాజాతరకు ముందే పనులు పూర్తిచేసేలా అధికారులు పగలు, రాత్రి పనిచేయాలని ఆదేశించారు. భక్తితో, సమ్మక్క మాలధారణ చేసినట్లుగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అదే సమయంలో, కేంద్రంపై విరుచుకుపడిన సీఎం రేవంత్ రెడ్డి, కుంభమేళాకు వేలకోట్లు- ఇస్తున్న కేంద్రం, ఆదివాసీ కుంభమేళా మేడారం జాతరకు నిధులు ఎందుకు ఇవ్వడంలేదు? జాతీయ స్థాయిలో మేడారం జాతరకు గుర్తింపు ఇవ్వాలని, నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం' అని స్పష్టం చేశారు. మహాజాతర సమయంలో తిరిగి వచ్చి, ఈ జాతరను మరింత ఘనంగా నిర్వహిస్తామని భక్తులకు హామీ ఇచ్చారు. చివరగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ పూజారులను సత్కరించారు. అలాగే ఆయన నిలువెత్తు బంగారాన్ని అమ్మవారికి సమర్పించారు.

## ఆరోగ్యాంధ్రప్రదేశ్ మనందరి లక్ష్యం

జనాభా క్రమంగా తగ్గుతోందని చెప్పుకొచ్చారు. యూపీ, బిహార్ వల్లే జనాభా బ్యాలెన్స్ అవుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గుతోందని తెలిపారు. ఏపీలో పీహెచ్‌సీల సంఖ్య జాతీయ సగటు కంటే ఎక్కువ అని వివరించారు. డబల్యుూహెచ్‌వో ప్రకారం మెడికల్ ఆఫీసర్లు మనదగ్గరే ఎక్కువ అని చెప్పుకొచ్చారు. ఏపీలో ప్రస్తుతం 1.15 లక్షలమంది వైద్యులు ఉన్నారని వెల్లడించారు. భారతదేశంలో సగటు- జీవితకాలం 70 ఏళ్లు అని వివరించారు. మనదేశంలో ఇమ్యూనైజేషన్ 97 శాతమని చెప్పుకొచ్చారు. ఏపీలో 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 42 శాతమేనని వివరించారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు 78 శాతం సాధించామని వెల్లడించారు. త్వరలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో 100 శాతం సాధిస్తామని ఉద్ఘాటించారు. గర్భిణుల్లో అనీమియా 32 శాతం ఉందని తెలిపారు. సిజేరియన్‌లో మనమే నెంబర్‌వన్.. ఇది సరికాదని చెప్పుకొచ్చారు. 90 శాతం సిజేరియన్లు ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో 90 శాతం సిజేరియన్ ఆపరేషన్లు ప్రైవేటు- ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని.. తమ ప్రభుత్వం ఇలాంటి ధోరణిని ఏమాత్రం ఆమోదించబోదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గర్భిణులకు సురక్షిత ప్రసవంపై అవగాహన కల్పించాలని, యోగా నేర్పించే పరిస్థితి రావాలని.. దీనిపై ఇప్పటు- నంచే శ్రద్ధ పెట్టాలని, పిలిచి మాట్లాడాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు సూచించారు. ఎప్పుడైనా సరే ఆపరేషన్.. ఆపరేషనే. భగవంతుడు ఇచ్చిన సహజసిద్ధమైన శరీరాన్ని కోయడం మంచిది కాదు. సిజేరియన్‌లో అగ్రస్థానంలో ఉన్నాం.. ఇది సరికాదు. ఇలాంటివి ఎలా నియంత్రించాలో ఆలోచించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగితే.. అందులో 42 శాతం ప్రభుత్వాస్పత్రుల్లో జరుగుతున్నాయని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా క్రమంగా తగ్గుతోంది. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ తగ్గిపోతోంది. యూపీ, బిహార్ వల్లే భారత్‌లో జనాభా బ్యాలెన్స్ అవుతోంది. ఏపీలో పీహెచ్‌సీల సంఖ్య.. జాతీయ సగటు కంటే ఎక్కువగానే ఉంది. డబ్ల్యూహెచ్‌వో ప్రకారం మెడికల్ ఆఫీసర్లు మన వద్ద ఎక్కువే ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.15 లక్షల మంది వైద్యులు ఉన్నారు. మన దేశంలో సగటు- జీవిత కాలం 70 ఏళ్లుగా ఉంది. ఇమ్యూనైజేషన్ 97 శాతం సాధించాం. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు 78 శాతం సాధించాం. త్వరలోనే వంద శాతం సాధిస్తాం. గర్భిణుల్లో అనీమియా 32 శాతంగా ఉందని వివరించారు.

## నెలల తరబడి పెండింగ్‌లో రేషన్ కమీషన్

బియ్యం పంపిణీకి సంబం ధించిన కమీషన్ అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటు ంటే ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దారుణమని అన్నారు. రేషన్ డీలర్లు మంగళవారం నగరంలోని తన నివాసంలో హరీష్‌రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భ ంగా హరీష్‌రావు మాట్లాడుతూ, అభయహస్తం పేరిట విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు 5 వేల గౌరవ వేతనంతో పాటు- కమీషన్ పెంపు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా ఇప్పటికీ అతీగతీ లేదని, ఎన్నికల ముందు అబద్దపు హామీలతో నమ్మించి, ఇప్పుడు నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటలు తప్ప చేతలులేని కోతల ప్రభుత్వం ఇది అని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సచివాలయానికి రేషన్ డీలర్లను ఆహ్వానించి వారి సమస్యలను విని పరిష్కరించామని గుర్తు చేశారు. మెట్రిక్ టన్నుకు ఇచ్చే కమీషన్‌ను 900 నుంచి 1400 రూపాయలకు పెంచామని, ప్రభుత్వంపై 139 కోట్ల అదనపు భారం పడుతున్నా రేషన్ డీలర్ల సంతోషం కోసం కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.

2014లో మెట్రిక్ టన్నుకు 200 రూపాయలుగా ఉన్న కమీషన్‌ను, 1400 రూపాయలకు పెంచామని, 17వేలకు పైగా ఉన్న రేషన్ డీలర్ల ముఖాల్లో చిరునవ్వులు నింపామని అన్నారు. కమీషన్ చెల్లించడమే కాదు, కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100 మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్ మంజూరు చేశామని చెప్పారు. రేషన్ డీలర్‌షిప్ వయో పరిమితిని 40 నుంచి 50 ఏళ్లకు పెంచామని అన్నారు.

కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీని సైతం అమలు చేయకుండా రేషన్ డీలర్ల పాలిట శకునిలా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రేషన్ డీలర్లకు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సంబురాన్ని లేకుండా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ వైఖరిని హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ కమీషన్, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సెప్టెంబర్ కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు- 5 వేల గౌరవ వేతనం, కమీషన్ పెంపు ప్రకటించాలని హరీష్‌రావు బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.


# కామారెడ్డి వరద నష్టంపై రీ సర్వే చేయాలి

కామారెడ్డిలో వరద నష్టానికి ఒక్క పైసా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకుం టోందని గుర్తుచేశారు. మాధవనగర్, మామిడిపల్లి, అర్సపల్లి రైల్వే బ్రిడ్జిల కోసం బీజేపీ ఉద్యమాలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మూడు ప్రాంతాల్లో ఆందోళనలు చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. వరద నష్టం నిధులను ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర వేషాలు వేస్తోందని ఎంపీ అర్వింద్ విమర్శించారు. మంగళవారం నిజామా బాద్‌లో అర్వింద్ మీడియాతో మాట్లాడారు. కామారెడ్డిలో వరద నష్టం ఇవ్వకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే చిల్లర వేషాలనూ కాంగ్రెస్ కూడా వేస్తోందని ధ్వజమెత్తారు. నిజామాబాద్‌లో టీ-పీసీసీ అధ్యక్షులు, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నా పెండింగ్ పనులకు నిధులు ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని.. ఆల్మట్టి పెంపుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తేల్చుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని ధ్వజమెత్తారు. ప్రత్యామ్నాయంగా తెలంగాణలోని ప్రజలు నమ్మకంతో బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. రైతు బంధు నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షలాది మంది రైతులకు ఏ ఒక్కసారి ఆపకుండా పీఎం కిసాన్ యోజన నిధులు జమ చేస్తున్నారని స్పష్టం చేశారు. రిటైర్‌మెంట్ డబ్బులు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ఉద్యోగులు నేడు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ పాలన వైపు చూస్తున్నారని వెల్లడించారు. కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని దిశానిర్దేశం చేశారు.

# ప్రజల బతుకమ్మ గా సీఎం రేవంత్, ప్రజా పాలనలో సంబరాలు

- బతుకమ్మ తో అమ్మవారి ఆశీర్వాదం ప్రజలపై ఉండాలి
- గాంధీభవన్ లో బతుకమ్మ సంబరాలు
- రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు
- టీపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్





హైదరాబాద్ (తెలుగు రేఖ) సెప్టెంబర్ 23:
టీపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు 2014 లో బతుకమ్మ వచ్చినట్లు రాజకీయ లబ్ధి కోసం బిఆర్ఎస్ వాడుకుంది ప్రజల బతుకమ్మ గా సీఎం రేవంత్, ప్రజా పాలనలో సంబరాలు బతుకమ్మ తో అమ్మవారి ఆశీర్వాదం ప్రజలపై ఉండాలి తీరొక్క పూలతో ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ బతుకమ్మ సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలి గల్ఫ్ బాధితుల కోసం కఠిన చట్టాలు తీసుకొస్తాం దళారులు కట్టడి కోసం పకడ్బందీ చర్యలు దుబాయ్, మస్కట్ లో బాధితుల కోసం గల్ఫ్ ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నాం బతుకమ్మ గిన్నిస్ రికార్డు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి టీపీసీసీ NRI సెల్ ఆధ్వర్యంలో గాంధీభవన్ ఘనంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమ బతుకమ్మ సంబరాలు ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిపిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయ లక్ష్మి, సాంస్కృతిక శాఖ ఛైర్మెన్ వెన్నెల గద్దర్ , గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎన్. ఆర్.ఐ చైర్మన్ వినోద్ కుమార్, సభ్యులు, చెన్నమనేని శ్రీనివాస్, కార్పొరేషన్ చైర్మన్లు కల్వ సుజాత, రైతు కమిషన్ మెంబెర్ భవాని రెడ్డి, బొజ్జ సంధ్యా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం..

## భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడమే ట్రంప్ లక్ష్యం !


ట్రంప్ టారిఫ్‌లు, వీసా ఫీజులు అంతా కూడా కేవలం భారత్‌ను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవే. భారత్ ఆర్థిక మూలాలలను దెబ్బతీయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తున్నాయి. అమెరికాకు మోకరిల్లాలే తప్ప కాలర్ ఎగరేసుకుని తిరగరాదన్న ఆధిపత్య ధోరణి ట్రంప్‌లో కనిపిస్తోంది. రష్యా నుంచి చమురు దిగుమతి అన్నది ఒక సాకు మాత్రమే. భారత్ ఆర్థిక శక్తిగా ఎదగడాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఓట్ల కోసం భారత్‌ను,ఎన్నారైల కాళ్లావేళ్లా పడి,మోడీతో చెలిమిని నటించిన ట్రంప్ గెలిచాక గేర్ మార్చడం వెనక సొంత ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. భారత్ ఆర్థికంగా ఎదిగితే తమకు పోటీదారు అవుతుందన్న బెంగ ప్రధానంగా ఉంది. దీనికితోడు సైనికంగా స్వయం సమృద్ధిని సాధించడానికి కూడా ట్రంప్ తట్టుకోలేక పోతున్నాడు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ తరవాత ఆయనలో అసహనం పెరిగింది.భారత్ సైనిక సత్తాచాటడం స్వదేశీ ఆయుధాలతోనే పాక్ పీచమణిచింది. పాక్‌లో స్థావరం ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్న అమెరికాకు ఇది గిట్టడం లేదు. పాక్‌కు తాము సరఫరా చేసిన ఆయుధా లు కూడా పనిచేయకపోవడం అవమానంగా భావిస్తోంది. ఈక్రమంలోనే పాక్ ఆర్మీ చీఫ్‌ను పిలిచి ట్రంప్ మరీ చంకన కూర్చోబెట్టుకున్నారు. పాక్‌తో వాణిజ్యం మొదలు పెట్టారు. పాక్ ఆయిల్ అమ్మకం దారుగా ఎదుగుతుందని, భారత్ కూడా కొనాల్సి వస్తుందని బెదరించారు. ఇలా చేస్తూనే 50శాతం సుంకాలను ఎకాఎకిన పెంచేశారు. అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులను కొనేలా ఒత్తిడి తెస్తున్నారు. మొత్తంగా భారత్ మార్కెట్‌ను దెబ్బతీసే కుట్ర కూడా ఇందులో దాగివుంది. ఇదే క్రమంలో వీసా పిడుగులు కురిపించారు. ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేశారు. ఓ రకంగా ఇదో బెదరింపు చర్యగా చూడాలి. 70శాతం పైగా హెచ్-1 వీసాదారులు భారతీయులు. అందుకే దీని ఫీజును అమాంతంగా లక్ష డాలర్లు చేశారు. తొలిరోజు ప్రకటన చేసే సమయంలో అక్కడి కామర్స్ మినిస్టర్ ఇది ఏడాదికోమారు ఉంటుందని, వెంటనే అమల్లోకి వస్తుందని ప్రకటించారు. దీంతో అమెరికాలో ఉన్న భారతీయ వీసాదారులు భయపడ్డారు. తరవాత ప్రెస్ సెక్రటరీ విడుదల చేసిన నోట్‌లో పూర్తి భిన్నంగా ఉంది. లక్ష డాలర్ల ఫీజు  కొత్త వారికేనని, పాతవారికి, రెన్యువల్ చేసుకునే వారికి లేదని,ఇది వచ్చే యేడు నుంచి అమల్లోకి వస్తుందని వివరణ ఇచ్చారు.మొత్తంగా ఇదంతా భారత్‌ను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవే అని తేలింది. ఈ క్రమంలో భారత్ కూడా అప్రమత్తంగా ఉండాలి. దేశీయంగా మన టెక్నాలజీకి పదను పెట్టాలి. మన దగ్గరే ఉద్యోగావకాశాలు పెంచాలి. ఓ రకంగా చెప్పాలంటే ట్రంప్‌తో పాటు, పాక్ కూడా మోడీ తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకి స్తున్నాయి. అందుకే పాక్ అమెరికాకు మరింత దగ్గరకావడానికి అవకాశం వచ్చింది. ఒసామాబిన్ లాడెన్ ఉగ్రచర్యలను ట్రంప్ మరచిపోయారు. పాక్‌ను దువ్వి పాలు పోస్తున్నారు. దీనికి అమెరికా మూల్యం చెల్లించుకోక తప్పదు. పాక్ కూడా అమెరికా అండతో భారత్‌పై మరింత కాలుదువ్వే అవకాశాలు ఉన్నాయి. ఉగ్రచర్యలను ప్రేరేపించవచ్చు. ఎందుకంటే మోడీ ఉన్నంత కాలం తమదేశం స్వేచ్ఛగా ఉంటుందన్న నమ్మకం కోల్పోయింది. గతంతో పోలిస్తే మోడీ పాక్ పట్ల కఠినంగానే ఉంటున్నారు. అణుబెదిరింపులను పూచికపుల్లతో  తీసేసారు. ప్రతిగా ఘాటుగా సమాధానం ఇస్తున్నారు.మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంనుంచి దిగిపోవాలని పాక్ చూస్తోంది. అందుకు ఇప్పుడు పాకిస్తాన్‌తో సంబంధాలు మోడీకి ముందు, మోడీకి తర్వాత అన్నట్లుగా మారాయి. గతంలో పాకిస్తాన్ ఎన్ని ఉగ్రవాద దాడులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలు కానీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం కానీ దౌత్య సంబంధాలను పూర్తిస్థాయిలో తగ్గించుకునే ప్రయత్నం చేయలేదు. పాకిస్తాన్ పట్ల విదేశాంగ విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. పాకిస్తాన్‌లో పౌర ప్రభుత్వం ఉన్నా, సైనిక ప్రభుత్వం ఉన్నా దౌత్య సంబంధాలు బాగానే ఉన్నాయి. కొన్ని సార్లు బ్యాక్-ఛానెల్ దౌత్యం ద్వారా రెండు దేశాలు సంబంధాలు నెరిపాయి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత, స్వయంగా అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంట్లో శుభకార్యం ఉంటే లాహోర్ వెళ్లాడు. పాక్‌కి స్నేహ హస్తం చాచారు. కానీ, యథావిధిగా పాకిస్తాన్ తన బుద్ధి చూపిస్తూ వచ్చింది. పఠాన్ కోట్, ఉరీ, పుల్వామా, పహల్గామ్ ఇలా ఉగ్రవాద దాడులకు పాల్పడుతూనే ఉంది.ఇన్నాళ్లు పాకిస్తాన్‌కు ఓ ధీమా ఉండేది. భారత్‌పై దాడి చేస్తే, పాకిస్తాన్‌ను నిందిం చడం, ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోరనే ధీమాతో ఉండేది. కానీ, మొదటిసారిగా ఉరీ దాడి తర్వాత, భారత సైన్యం పీఓకేలోకి వెళ్లి సర్జికల్ స్ట్రయిక్స్ చేసింది. పుల్వామా దాడి తర్వాత బాలాకోట్ స్ట్రయిక్స్ చేసింది. తాజాగా, పహల్గామ్ దాడి తర్వాత పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ తో  పాక్ సైన్యం ఎయిర్ బేసులతో పాటు-, పాకిస్తాన్ లోపల ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. ఇలా భారత్ ప్రతీకారం తీర్చు కోవడం అనేది, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాతే జరుగుతుండటంతో పాకిస్తాన్, ప్రస్తుత ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కొన్ని సందర్భాల్లో కాంగ్రెస్, రాహుల్ గాంధీలను పాక్ నాయకులు, ఆ దేశ సెలబ్రిటీలు ప్రశంసించడం చూస్తుంటే, అప్పటి యూపీఏ హయాంలోనే మా పరిస్థితి బాగుండేది అని భావిస్తున్నట్లు- కనిపిస్తోంది. అంతేగాకుండా మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నట్లు పాక్ పాలకు తీరును బట్టి అర్థం అవుతోంది. పాకిస్తాన్‌తో 1965, 1971, 1999 కార్గిల్ వార్ సమయాల్లో కూడా మన దేశం పాకిస్తాన్‌తో దౌత్య సంబంధాలను ఎప్పుడూ పూర్తిగా తెంచుకోలేదు. పాక్‌కి ఆధారమైన సిందూ నది ఒప్పందంను ఎప్పుడూ నిలుపుదల చేయలేదు. కానీ మోడీ వచ్చిన తర్వాత దాయాదికి క్లియర్ మెసేజ్ ఇచ్చారు. రక్తం, నీరు కలిసి ప్రవహించవని చెప్పి, సిందూ ఒప్పందాన్ని నిలిపేశారు. దీంతో ఒక్కసారిగా పాకిస్తాన్ లో హాహాకారాలు మొదలయ్యాయి. ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగే ప్రసక్తే లేని స్పష్టం చేశారు. ఉగ్రవాదం, వాణిజ్యం కలిసి సాగవని చెప్పారు. అలాగే మనదేశంలో కూడా మోడీ రాకతో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ లభించింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు, పాక్ కవ్వింపులను ధీటుగా ఎదుర్కొనేం దుకు ఎలాంటి అనుమతులు అక్కర లేకుండా వెంటనే నిర్ణయం తీసుకునే వెసులుబాటు సైన్యానికి కల్పించారు. గతంలో సరిహద్దుల వెంబడి పాక్ సైన్యం కాల్పులు జరపడం, మన సైనికుల్ని అపహరించి తలలు నరికిన సందర్భాలు ఉన్నాయి. కానీ మోడీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పాక్ యాక్షన్‌కు అంతకన్నా సీరియస్ రియాక్షన్ ఉంటుందని తన చర్యల ద్వారా స్పష్టం చేశారు. దీంతో సైన్యం కూడా పాక్‌ని ఎప్పటికప్పుడు దెబ్బ తీస్తుంది. ఇన్నాళ్లు, పాకిస్తాన్ తన అణ్వాయుధాలను చూపిస్తూ బ్లాక్‌మెయిల్ చేసేది, ఆపరేషన్ సిందూర్‌తో ఇక ఈ బ్లాక్‌మెయిల్‌ని సహించేది లేదని భారత్ స్పష్టం చేసింది. పాక్ అణ్వాయుధాలు నిల్వ చేస్తారనే ప్రచారం ఉన్న కిరాణా హిల్స్ సమీపంలో భారత్ దాడులు చేసి గట్టి సందేశం ఇచ్చింది. ప్రధాని మోడీ కూడా ఇక పాక్ అణ్వాయుధ బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. ముంబై ఉగ్రదాడుల సమయంలో భారత్ వైఖరి, కాంగ్రెస్ ప్రతిస్పందనతో పోలిస్తే మోడీ వచ్చాక కాస్త మార్పు వచ్చిందని దేశ ప్రజలే చెబుతున్నారు. అందుకే పాకిస్తాన్ ప్రజలు, అక్కడి నేతలు మోడీ ఎన్నికల్లో ఓడిపోవాలని కోరుకుంటున్నారు. మోడీ ఓడిపోవాలని పాక్ కోరుకుంటున్నట్లు పాక్ మాజీ మంత్రి ఫవాద్ చౌదరి అన్నారు. మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో, సిట్టింగ్ ఎంపీలు పదే పదే మోడీని విమర్శిస్తూ వస్తున్నారు. అమెరికా తోడు వచ్చింది కనుక ఇక తమకు తిరుగులేదని భావిస్తోంది. తాజాగా ట్రంప్ తీసుకుంటున్న చర్యలు కూడా ఓ రకంగా పాక్‌కు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలుగానే చూడాలి.

# విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రులు

### గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

### భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

**విజయవాడ,సెప్టెంబర్23(తెలుగు రేఖ):**
శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజున విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. సమస్త దేవతా మంత్రాలకు గాయత్రీ మంత్రంలో అనుబంధం ఉంది. అందుకే ఆయా దేవతల మూల మంత్రాలతో గాయత్రిని చేర్చి 'రుద్రగాయత్రి', 'లక్ష్మీగాయత్రి', 'విష్ణుగాయత్రి' అని గాయత్రీ మంత్రంతో సంప్రోక్షణ చేసిన తర్వాతే ఆయా దేవతలకు నివేదన చేస్తారు. సకల మంత్రాలకి మూలమైన శక్తిగా, వేదమాతగా ప్రసిద్ధి పొందిన గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ, పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్టానదేవత. ఆ తల్లి అధిష్టాన దేవత సూర్యభగవానుడు. కాబట్టి గాయత్రీ అమ్మవారిని దర్శించుకోవడం వల్ల సూర్యుడు అనుగ్రహంతో ఆరోగ్యం లభిస్తుందని నమ్మిక. ప్రాతఃకాలంలో గాయత్రి గాను, మధ్యాహ్న కాలంలో సావిత్రి గాను, సాయంసంధ్యలో సరస్వతి గాను ఆమె భక్తుల పూజలు అందుకుంటుంది. గాయత్రీ ఉపాసనతో బుద్ధి తేజోవంతం అవుతుందనీ, గాయత్రీ మంత్ర జపం చతుర్వేద పారాయణ ఫలితాన్ని ఇస్తుందనీ పురాణాలు చెబుతున్నాయి. వరదాభయహస్తాలతో సకల వేద స్వరూపమైన గాయత్రీదేవిని ఆదిశంకరులు అనంతశక్తి స్వరూపంగా అర్చించారు. గాయత్రీ మంత్రాన్ని



జపిస్తూ దుర్గమ్మను ధ్యానిస్తే సకల మంత్ర సిద్ధి, బ్రహ్మజ్ఞానం కలుగుతాయని, పూజించిన వారికి సద్బుద్ధులు కలుగుతాయని,. పాపాలు నశిస్తాయని, అజ్ఞానం తొలగిపోతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రోజున ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గమ్మ శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తోంది. దేవీ నవరాత్రులలో రెండవ రోజు ఆశ్వయుజ శుక్ల తదియ నాడు కదంబవనవాసిని అయిన ఆ పరమేశ్వరి శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులతో పూజలను అందుకుంటుంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ కనక దుర్గమ్మ నవరాత్రులలో రెండో రోజున చతుర్వేద స్వరూపమైన శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో కాషాయం రంగు లేదా కనకాంబరం చీర ధరించి అత్యంత సుందరంగా భక్తులకు దర్శనం ఇస్తుంది. ఇంద్రకీలాద్రిపై గాయత్రి దేవిగా దర్శనం ఇస్తున్న దుర్గమ్మ దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తెల్లవారు జామున 3 గంటల నుంచే దర్శనాలు ప్రారంభం అయ్యాయి. కాగా దసరా నవరాత్రులలో మొదటి రోజు భక్తజనం విశేషం గా తరలివచ్చారు.  60 వేల మందికి పైగా భక్తులు బాల త్రిపురసుందరి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. తొలిరోజు పలు రకాల సేవల, దర్శన టికెట్ల రూపేణా రూ. 22 లక్షల 72 వేల 214 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ సిబ్బంది చెప్పారు.

# యూరియా కోసం తప్పని యాతన



**- ప్రభుత్వ ప్రకటనలపై రైతుల మండిపాటు**

**విజయవాడ,సెప్టెంబర్23 (తెలుగు రేఖ):**
ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది యూరియా కొరత తీవ్రస్థాయిలో కనిపిస్తోంది. గతంలో ఎప్పుడు సహకార సంఘ కార్యాలయాలకు మహిళలతో సహా వెళ్లి యూరియా కావాలంటూ లైన్ లో నిలబడిన పరిస్థితులు అంతంత మాత్రమే. కానీ ఈ ఏడాది వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం ... అవసరానికి మించి అమ్మకాలు చేసినట్లు- చెబుతుండగా, మరోవైపు రైతులు మాత్రం యూరియా లేదంటూ ఆందోళన చేస్తున్న ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. అసెంబ్లీలో సైతం మంత్రి అచ్చన్నాయుడు యూరియా కొరత లేదన్నారు. కావాలనే గందరగోళం సృష్టిస్తున్నారని చెప్పారు. కానీ ఈ పరిస్థితి మంగళవారం పలు గ్రామాల్లో నెలకొంది. రైతులు వేలల్లో ఉండగా, యూరియా కట్టలు మాత్రం వందల్లో సరఫరా జరిగింది. ఈ విషయమై అక్కడ వైసిపి నాయకులు మాట్లాడుతూ ... అధికారులు కాకి లెక్కలు చెబుతున్నారని ఆగ్రహించారు. వాస్తవ పరిస్థితులు చూస్తే యూరియా అవసరమైన స్థాయిలో సరఫరా జరిగితే రైతులు ఎందుకు రోడెక్కుతారని ప్రశ్నించారు. ఇదిలా ఉంటే ఎక్కడైనా యూరియా అంటూ ఆందోళన చేస్తుంటే కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వం ఆదేశిస్తుందంటూ, ఉమా ఆవేదన చెందారు. మొత్తం మీద మంగళవారం పెనుగోలను లో 25 టన్నులు, రాజవరం 5 టన్నులు, ఊటు-కూరు 16 టన్నులు యూరియా సరఫరా జరిగింది. ఈ విషయమై వ్యవసాయ అధికారి వల్లభనేని హరీష్ మాట్లాడుతూ ... గత ఏడాది కంటే ఈ ఏడాది మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఎక్కువ యూరియాను సరఫరా చేసి రైతులకు అందజేసినట్లు- తెలిపారు.

# సెక్రెటరియేట్ లో ఐఏఎస్ ల తీరుపై చర్చ

**హైదరాబాద్ (తెలుగు రేఖ) సెప్టెంబర్ 23:**
తెలంగాణ సెక్రటేరియట్ లో కొత్త సాంప్రదాయానికి అధికారులు బీజం వేస్తున్నారు. అధికారిక కార్యక్రమాలకు ఐఏఎస్ లు హాజరుకావడం లేదు.జెండా ఎగురవేసే కార్యక్రమాలను అధికారులు పట్టించుకోవడం లేరు. తెలంగాణ సెక్రటేరియట్ లో కొత్త సంప్రదాయకం కనిపిస్తుంది. ప్రభుత్వ కార్యక్రమాలను సిఎస్ నుంచి సెక్రెటరీ స్థాయి వరకు అధికారులు అంటి ముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నిర్వర్తించే ప్రతీ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పాల్గొంటారు. కానీ గడిచిన కొన్ని నెలలుగా సెక్రటేరియట్ లో అలాంటి వాతావరణం కనిపించడం లేదు. ముఖ్యంగా సిఎస్ గా రామకృష్ణ రావు భాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రభుత్వం నిర్వర్తించే అధికారిక కార్యక్రమాలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయి.ఉమ్మడి రాష్ట్రంలో అయినా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో అయినా జెండా ఎగరవేసే కార్యక్రమాలు సెక్రటేరియట్ లో జరిగితే సిఎస్ గాని, పొలిటికల్ సెక్రెటరీ గాని పాల్గొనే సాంప్రదాయం ఉండేది.గడిచిన ఆగస్టు 15వ తేదీ, సెప్టెంబర్ 17వ తేదీ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో సిఎస్ గాని, పొలిటికల్ సెక్రెటరీ గాని పాల్గొనలేదు. సెక్రటేరియట్ లో ఒక్క ఐఏఎస్ అధికారి, HOD, ఒక్క ఉద్యోగి సైతం పాల్గొనలేదు. కేవలం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ జెండా ఎగరవేసి, కార్యక్రమాన్ని ముగించారు. సిఎస్ సోమేష్ కుమార్ కంటే ముందు పొలిటికల్ సెక్రెటరీ జెండా



కార్యక్రమంలో పాల్గొనే వారు.సోమేష్ కుమార్ సిఎస్ గా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయనే స్వయంగా ప్రతీ కార్యక్రమంలో పాల్గొనేవారు.ఆ సాంప్రదాన్ని సిఎస్ శాంతి కుమారి కొనసాగించారు. కానీ ఇప్పుడు రామకృష్ణ రావు భాద్యతలు తీసుకున్న తర్వాత ఆగస్టు 15వ, సెప్టెంబర్ 17వ తేదీ వచ్చింది. ఈ రెండు కార్యక్రమాలకు సిఎస్ దూరంగా ఉన్నారు. దీంతో అధికారిక కార్యక్రమాలు నిర్వహణకు సిఎస్, పొలిటికల్ సెక్రెటరీ లాంటి సీనియర్ ఐఏఎస్ లు దూరంగా ఉంటే మిగతా ఉద్యోగులకు ఎలాంటి సంకేతం ఇస్తున్నారని చర్చ సెక్రటేరియట్ లో జరుగుతుంది. మరి రాబోయే అధికారిక కార్యక్రమాలకు ఉన్నతాధికారులు పాల్గొంటారా? లేదా చూడాలి.

# మేమంతా గిరిజనేతరులమే

**- మా గ్రామాలను గిరిజన గ్రామాలుగా ఎలా గుర్తిస్తారు**

**- మంగపేట మండలంలోని 23 గ్రామాల ప్రజల వాదన**

**- స్థానిక ఎన్నికల్లో 23 గ్రామాల్లో స్టే విధిస్తూ సుప్రీం ఆదేశం**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్23( తెలుగు రేఖ):**
ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించడంపై ఆయా గ్రామాల గిరిజనేతరులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మేమంతా గిరిజనేతరులమే.. మా గ్రామాలను గిరిజన గ్రామాలుగా ఎలా గుర్తిస్తారు అంటూ మంగపేట మండలంలోని 23 గ్రామాల ప్రజల వాదించారు. దీంతో స్థానిక ఎన్నికల్లో 23 గ్రామాల్లో స్టే విధిస్తూ సుప్రీం ఆదేశం ఇచ్చింది. దీనిపై 2013లో గిరిజన సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కన పెట్టి.. నిజాం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై స్థానికులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పరిగణించవద్దని పిటిషన్‌లో పేర్కొన్నారు. 1950లో రాష్ట్రపతి



ఇచ్చిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలో 23 గ్రామాలు లేవని గిరిజనేతరుల తరఫు న్యాయవాది విష్ణువర్ధన్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ స్టే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం.. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. మంగపేట పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికలపైనా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# పిసి ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయండి

### హైకోర్టులో సవాల్ చేసిన ఐఎఎస్ స్మితా సబర్వాల్

**హైదరాబాద్,సెప్టెంబర్23( తెలుగు రేఖ):**
సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ తెలంగాణ హైకోర్టును  ఆశ్రయించారు. కాళేశ్వరం అంశంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను హైకోర్టులో ఆమె సవాల్ చేశారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్ట కుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు- సమాచారం. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉండగా.. పరిశీలన పూర్తయి లిస్ట్ అయిన తర్వాత విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషి హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఇటీ-వల ఊరట లభించింది. కమిషన్ నివేదిక సిఫారసుల ఆధారంగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు, ఈ నివేదికను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను కేసీఆర్, హరీశ్‌రావుల పిటిషన్‌తోపాటు- అక్టోబరు 7కి హైకోర్టు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా స్మితా సభర్వాల్ సైతం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# ఐఏఎస్ అధికారుల్లో నిర్లిప్తత..

**- ఎదురు తిరుగుతున్న అధికారులు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 23, (తెలుగు రేఖ)**
రేవంత్ ముఖ్యమంత్రి అయిన తొలి రోజులవి. కాళేశ్వరం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై శ్వేత పత్రాలు విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్న రోజులు కూడా అదే. సాక్షాత్తు ముఖ్యమంత్రి ఆదేశించినప్పటికీ కొన్ని కీలక ఫైల్స్ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి కూడా చెప్పుకున్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి అడిగిన అనేక సందర్భాలలోనూ అధికారులు ఇదే ధోరణి ప్రదర్శించారు. తట్టుకోలేక ముఖ్యమంత్రి వారికి స్థానచలనం కలిగించారు. వారంతా గులాబీ పార్టీకి అనుకూలమైన వ్యక్తులని.. అందువల్లే ఎవరి మాటా వినరని సెక్రటేరియట్ లో ప్రచారం జరుగుతుంటుంది. తాజాగా ఓ మంత్రికి ఐఏఎస్ అధికారి నుంచి దారుణమైన సమాధానం ఎదురయింది. ఒక రకంగా ఆయన పరువు కూడా పోయింది. ఇంతకీ ఏం జరిగిందంటే..తెలంగాణలో మలి దశ మంత్రివర్గ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి లభించింది. ఆయన మంత్రి కావడం ఇదే తొలిసారి. సహజంగానే ఆయన ఉత్సాహంగా పనిచేస్తుంటారు. ఇటీవల కాలంలో తన శాఖకు సంబంధించిన కొన్ని ఫైల్స్ తన పేషి లో పనిచేస్తున్న సెక్రటరీకి పంపించారు. వాస్తవానికి వాటిపై వెంటనే సంతకాలు చేసి పంపించాల్సిన బాధ్యత సెక్రటరీ మీద ఉంటుంది. కానీ ఆ సెక్రెటరీ సీనియర్ ఐఏఎస్ అధికారి. పైగా గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వ పెద్దలతో ఆయన విపరీతంగా అంట కాగారు.. దీంతో అదే ధోరణి ఇప్పుడు కూడా సాగిస్తున్నారు.. రేవంత్ ప్రభుత్వం ఆ అధికారి పై ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. చర్యలు తీసుకుంటుందనే నమ్మకం కూడా లేదు. ఇక ఐఏఎస్ అధికారి కొత్త మంత్రి పంపించిన ఫైల్స్ మీద సంతకాలు పెట్టకపోగా.. సాక్షాత్తు మంత్రి ఫోన్ చేసినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు."ఏ దస్త్రం ఎప్పుడు పూర్తి చేయాలో నాకు తెలుసు. మీరు అనుక్షణం నా పనికి ఇబ్బంది కలిగించదు. ఎప్పుడు పడితే మీరు అప్పుడు ఫోన్ చేస్తే కుదరదని" మంత్రికి చెప్పడంతో.. ఆయన ఒక్కసారిగా షాక్ అయ్యారని తెలుస్తోంది. తన అనుచరులు.. కార్యకర్తల ముందు అలా మాట్లాడటంతో ఆ మంత్రి తలదించుకున్నారని తెలుస్తోంది. వాస్తవానికి మంత్రులు చెప్పిన పని అధికారులు చేయాలి. ఫైల్స్ మీద ఎప్పటికప్పుడు సంతకాలు పెట్టాలి. ఒకవేళ అందులో ఏవైనా లోపాలు ఉంటే మళ్ళీ పంపించాలి. అంతేతప్ప సంతకాలు పెట్టకుండా ఫైల్స్ రోజుల తరబడి పెండింగ్ ఉంచుకుంటే చాలా కష్టం. ఇదే విషయం ఆ ఆఫీసర్ కు కొత్త మంత్రి ఎన్ని సార్లు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రత్యేకంగా ఫోన్ చేసినా ఉపయోగం లేకుండా పోయింది. అయితే ఆ మంత్రి సదరు అధికారి వ్యవహారాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తున్నట్టు తెలుస్తోంది.

# ఎమ్మెల్యేలపై చర్యలు...

**అమరావతి, సెప్టెంబర్ 23, ( తెలుగు రేఖ)**
అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన వైసీపీ.. 11మంది ఎమ్మెల్యేలతో



సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఆ పార్టీకి టెక్నికల్‌గా ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కలేదు. అయితే.. సభలో నాలుగు పార్టీలు ఉండగా..మూడు కూటమి మిత్రపక్షాలే. ఇక మిగిలి ఉంది మేమే కాబట్టి.. మాకు ఆ హోదా కావాలన్నది వైసీపీ డిమాండ్. ప్రధాన ప్రతిపక్ష హోదా ఎలాపడితే అలా ఇచ్చేసేదికాదని, సభా నియమాల ప్రకారం నడుచుకుంటూ అందుకు తగ్గట్టు జనం ఇచ్చిన తీర్పును బట్టే ఇచ్చేదన్నది ప్రభుత్వ వాదన. ఈ విషయంలో వైసీపీ కోర్ట్‌కు వెళ్ళినా లక్ష్యం మాత్రం నేరవేరలేదు. తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభలో ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం ఉండదు కాబట్టి మేం..అసెంబ్లీకి రాబోమంటూ.. పట్టుదలగా ఉన్నారు మాజీ సీఎం జగన్. ఈ పరిస్థితుల్లో.. వైసీపీ ఎమ్మెల్యేలకు కొత్త భయం పెరుగుతున్నట్టు చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే ప్రతీసారి వైసీపీ వాళ్లు సభకు రావాలి.. రాకుంటే చర్యలు తప్పవని అంటున్నారు స్పీకర్, డిప్యూటీ స్పీకర్. బడ్జెట్ సెషన్‌లో వైసీపీ సభ్యులు మమ అనిపించినా.. టెక్నికల్‌గా అవి కౌంట్‌లోకి రాలేదు. దీంతో వరుసగా 60 రోజులు సభకు హాజరుకాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవచ్చని తాజాగా హాట్ కామెంట్స్ చేశారు ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు.ప్రస్తుతం సెషన్ నడుస్తున్న క్రమంలో.. సభకు హాజరవకుంటే.. అనర్హత వేటు వేస్తామని, మీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కూడా హెచ్చరించారు. ఇదే ఇప్పుడు పొలిటికల్ హాట్ అయ్యింది. తమ ఎమ్మెల్యేలపై చర్యల అంశంలో గతంలోనే స్పందించారు వైసీపీ అధ్యక్షుడు జగన్. వాళ్లకు బుద్ధి పుట్టినట్టు చర్యలు తీసుకోమనండ.. ఎవరు కాదన్నారంటూ రియాక్ట్ అయ్యారాయన. తాజాగా వైసీపీ ఎల్పీ సమావేశంలో కూడా ఇదే అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వాళ్ళు ఈ అంశాన్ని జగన్ ముందు ప్రస్తావించటంతో ఆయన కూడా గతంలో స్పందించిన తరహాలోనే చర్యలు తీసుకోనివ్వండి.. చూద్దాం అన్నట్టు తెలిసింది. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై చర్చించటానికే కదా.. మనం సమయం అడుగుతోంది. టెక్నికల్ రీజన్స్‌తో ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా కనీసం నిర్దిష్ట సమయం ఇస్తామని కూడా క్లారిటీగా చెప్పడం లేదు.. 40 శాతం ఓట్లు వచ్చిన మనల్ని సాధారణ సభ్యులుగా పరిగణించి రెండు, మూడు నిమిషాల సమయం ఇస్తే సరిపోదు కదా.. అని జగన్ అన్నట్టు చెప్పుకుంటున్నారు. అదే సమయంలో సభకు వెళ్ళని సభ్యుల మీద ఏకపక్షంగా చర్యలు తీసుకోవడం కూడా సాధ్యం కాదనేది వైసీపీ వర్షన్. చర్యలు తీసుకోబోయే ముందు స్పీకర్ వైసీపీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలి. ఆ నోటీసులకు వాళ్ళు సమాధానం చెప్పాలి. ఆ సమాధానాలకు సంతృప్తి చెందక పోతేనే.. స్పీకర్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.అయితే ఈ విషయంలో ఇప్పటికే వైసీపీ కోర్ట్‌కు వెళ్లి ఉండటం, స్పీకర్ యాక్షన్ తీసుకున్నా తిరిగి కోర్టును ఆశ్రయించే అవకాశం ఉండటం లాంటి కారణాలతో సాగదీత ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అంతేతప్ప ఇప్పటికిప్పుడు యాక్షన్ తీసుకునే అవకాశం ఉండకపోవచ్చన్నది విశ్లేషకుల మాట. దీంతో ఒకరిద్దరు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మినహా మిగతా వారిలో దాని గురించి అంత టెన్షన్ లేనట్టు తెలుస్తోంది. ఒకవేళ సీరియస్ యాక్షన్ తీసుకున్నా దానికి విరుగుడు మందును పార్టీ అధినేత జగన్ ఎలాగూ సిద్ధం చేస్తారు కాబట్టి కంగారేం లేదన్నది సీనియర్ ఎమ్మెల్యేల అభిప్రాయం అట. సభకు హాజరవలేదని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్న దాఖలాలు దేశంలో ఎక్కడా లేవని గుర్తు చేస్తున్నారు పొలిటికల్ పండిట్స్. రాజకీయ సవాళ్ళకు, చట్టపరంగా తీసుకునే చర్యలకు చాలా తేడా ఉంటుందని భావిస్తున్నారు.

# దుర్గామాతను దర్శించుకున్న ములకనూరు ఎస్సై రాజు

హనుమకొండ ,భీమదేవరపల్లి ,సెప్టెంబర్ 23 (తెలుగు రేఖ):
భీమదేవరపల్లి మండలం ములకనూరులోని వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా దేవి అమ్మవారిని ములకనూరు ఎస్సై రాజు మంగళవారం దర్శించుకున్నారు . యూత్ సభ్యులు ఎస్సై కి స్వాగతం పలికారు. అనంతరం వారు దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక అర్చన పూజలు నిర్వహించడం జరిగింది. వివేకానంద యూత్ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదములు అందజేశారు ఈ సందర్భంగా ఎస్సై ఏర్పాటుచేసిన మండపం ఏర్పాట్లు పట్ల నిర్వాహకులను ప్రశంసించారు . విగ్రహ ప్రతిష్ట వివరాలు అడిగి తెలుసుకున్నారు .నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని యూత్ వారికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్, రాంబాబు, శ్రీకాంత్, లోకేష్, మోహన్, గణేష్,చరను,లల్లు,శ్రీలత,సునీత,మాధవి,నికిత మరియు తదితర భక్తులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.



# వారసత్వంగా అనారోగ్య వ్యవస్థ వచ్చింది

**- ఆరోపణలు చేసే వారు అసెంబ్లీకి ఎందుకు రారు**
**- జగన్ హయాంలో మౌళిక సదుపాయాలు కూడా మృగ్యం**
**- బీపీఎల్, ఏపీఎల్ కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్యసేవ**
**- పిపిపి విధానంలో వైద్యకళాశాలల అభివృద్ధికి చర్యలు**
**- వైద్యారోగ్యశాఖపై చర్చలో మంత్రి సత్యకుమార్**



**అమరావతి,సెప్టెంబర్23( తెలుగు రేఖ):**
తమకు వారసత్వంగా అనారోగ్య వ్యవస్థ వచ్చిందంటూ ఏపీ వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఆరోగ్యంపై ఏపీ అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చలో మాట్లాడుతూ...ఈ వ్యాఖ్యలు చేశారు. నియామకాల నుంచి ట్రాన్సఫర్లల వరకూ ప్రతి చోట పొలిటికల్ ఇన్ఫ్యూఎన్స్ కూడా ఉండేదన్నారు. పీపీపీ విధానంలో కాలేజీలు నిర్మించినా ప్రజలకు అందించే సేవల విషయంలో ఇబ్బంది ఉండదని మంత్రి స్పష్టం చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. పీపీపీ విధానంలో వాళ్లు కాలేజీ నిర్మించి 33 ఏళ్ల తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారని తెలిపారు. ప్రైవేటీకరణకు పీపీపీకి తేడా తెలియకుండా వైసీపీ మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచితంగా ఓపీ, 70 శాతం పడకలు ఎన్టీఆర్ వైద్య సేవకు ఉచితంగా కేటాయించాలన్నారు. పీపీపీ విధానంలో నిర్మించిన కాలేజీలపై ప్రభుత్వమే అజమాయిషి చేస్తుందని వెల్లడించారు. జాతీయ హెల్త్ మిషన్ కింద 40 కార్యక్రమాలకు రూ.100 కోట్లు- కేంద్రం ఇన్సెంటివ్‌లు వచ్చాయని తెలిపారు. డాక్టర్‌ల అ-టె-ండెన్స్ 8 శాతం పెరిగిందని వెల్లడించారు. క్యాన్సర్‌కు ముందస్తు పరీక్షలు నిర్వహించి వ్యాధినిర్ధారణ నిర్వహిస్తున్నామని సభలో మంత్రి తెలియజేశారు. మౌళిక సదుపాయాల కోసం గత ప్రభుత్వం ఏమీ చేయలేదని విమర్శించారు. కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్ కర్నూలు, కడప, విశాఖలో, గుంటూరులో ఏర్పాటు- చేశామన్నారు. 30 పాయింట్స్ యాక్షన్ ప్లాన్ తీసుకొచ్చి ఎక్కడికక్కడ ఆడిట్ చేస్తున్నామన్నారు. యూనివర్సియల్ హెల్త్ కేర్ సెంటర్ ను తీసుకువస్తున్నామని చెప్పారు. బీపీఎల్, ఏపీఎల్ కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా వైద్యం అందిస్తున్నామని అన్నారు. అబద్దాలు చెప్పడమే అలవాటుగా మారిన పార్టీ వైసీపీ అంటూ సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడ్డలి పోటును గుండెపోటుగా చిత్రీకరించిన వారు మెడికల్ కాలేజీలను అమ్మేస్తున్నారని అంటున్నారని ఫైర్ అయ్యారు. నాలుగు సంవత్సరాల్లో రూ.8,420 కోట్లు- ఖర్చు చేయాల్సి ఉండగా గత ప్రభుత్వం రూ.1550 కోట్లు- మాత్రమే ఖర్చు చేసిందని వివరించారు. రూ.1550 కోట్లు- నబార్డు, సెంట్రల్లీ స్పాన్సర్డ్ ఫండ్స్ దీనిలో ఉన్నాయన్నారు. సంవత్సరానికి రూ.387 కోట్లు- ఖర్చు చేశారని.. ఇదే విధంగా జరిగితే 18 సంవత్సరాలు పడుతుందని తెలిపారు. ఐదు కాలేజీల్లో తరగతులు కూడా జరుగుతున్నాయని జగన్ అంటు-న్నారని.. మీ వాదనలో నిజం ఉంటే సభకు రావాలని... వచ్చి చర్చలో పాల్గొనాలని సవాల్ చేశారు. పార్వతీపురం భూమిని సేకరించకుండానే మెడికల్ కాలేజీ కట్టేశాం అంటున్నారని అన్నారు. పీపీపీ మోడ్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పారు. యాజమాన్య హక్కు తమ వద్దే ఉంటుందన్న వారు ఇచ్చేది కేవలం లీజు మాత్రమే అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మేము వస్తే ఈ కళాశాలల నిర్మాణం రద్దు చేస్తా అని ఎలా అంటారు.. ఈ రాష్ట్రమేమైనా మీ జాగీరా మీరేమైనా పాలేగాళ్లా. చంద్రబాబు, వాజ్ పాయ్ గారితో కలిసి అధికారం లో ఉన్నప్పుడు 17 మెడికల్ కాలేజీలు తెచ్చారు. గతంలో ఎన్డీయే హయాంలో నిత్యం ఢిల్లీ వెళ్ళి కాలేజీలు కావాలని అడిగేవారు. మీరు ఎప్పుడైనా కళాశాలలు కావాలని అడిగారా. చంద్రబాబు నాయుడు వాడారు కనుక ప్రజా వేదికను కూల్చారు. కానీ మేము మాత్రం పులివెందులలోని మెడికల్ కాలేజీని పూర్తిచేశాం' అని వెల్లడించారు. మెరుగైన నిర్వహణ కోసమే కొత్త వైద్య కళాశాలను పీపీపీ విధానంలో ఏర్పాటు- చేసినట్లు- మంత్రి తెలిపారు. యూపీతో పాటు- నాలుగైదు రాష్ట్రాల్లో వైద్య కళాశాలలు పీపీపీ విధానంలో ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా తాము చూసుకోవాలన్నారు. జగన్ హయాంలో ఏడాదికి రూ. 300 కోట్లు- మాత్రమే వైద్య కళాశాల కోసం ఖర్చు చేశారని చెప్పుకొచ్చారు. పులివెందుల వైద్య కళాశాలకు కూడా సరిగ్గా నిధులు కేటాయించి ఖర్చు చేయలేదని తెలిపారు. జాతీయ వైద్య మండలి పులివెందుల కాలేజీకి అనుమతి నిరాకరించిందన్నారు. జగన్ హయాంలో ప్రభుత్వ వైద్య కాలేజీల్లో పేమెంట్ సీట్లు- పెట్టారని.. మేనేజ్మెంట్ కోటా, ఎన్ఆర్ఐ కోటా పెట్టి ఎంబీబీఎస్ సీట్లు- అమ్మాలని చూసింది జగన్ మాత్రమే అంటూ ఫైర్ అయ్యారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు పీపీపీ విధానం వ్యతిరేంచటం సిగ్గుచేటని అన్నారు. దీనిపై చర్చించటానికి తాము సిద్ధంగా ఉన్నా... జగన్ అసెంబ్లీకి రావటం లేదన్నారు. పేదలకు వైద్య విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టు-బడి ఉందని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది కల్లా నాలుగు వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో అందుబాటు-లోకి తెస్తామన్నారు. టెండర్ పక్రియను పారదర్శకంగా చేస్తున్నామన్నారు మంత్రి. కావాలంటే వైసీపీ వాళ్లు వచ్చి టెండర్లు వేయవచ్చని తెలిపారు. వైసీపీ వాళ్లు వైద్య కళాశాలల వద్దకు వెళ్లి సెల్ఫీలు తీసుకుంటు-న్నారని.. కేవలం కాలేజీ భవనాలు నిర్మించిన పులివెందులకు మాత్రం వెళ్లి ఫొటోలు దిగారన్నారు. భవనాలు లేని బాపట్ల, పార్వతీపురం వంటి ప్రాంతాలకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. నాలుగేళ్లు కాదు నలభై ఏళ్ల తర్వాత కూడా జగన్ వచ్చేది లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు హయాంలో ఒక్క కాలేజ్ కూడా రాలేదని జగన్ అవినీతి పత్రికలో వార్తలు రాస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు హయాంలో 2004 ముందు 9 కాలేజీలు, 2014లో 6 కాలేజీలు వచ్చాయని తెలియజేశారు. జగన్ హయాంలో కేంద్రం నుంచి నిధులు వచ్చినా కాలేజీలు కట్టలేదన్నారు. 22 వేల 575 ఉచిత సీట్లు- చంద్రబాబు హయాంలో వచ్చాయని గుర్తుచేశారు. గుంటూరు, కాకినాడ కాలేజీల్లో చదివిన వారు ఇప్పుడు తమ డబ్బులతో కాలేజీలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని... రాబోయే రెండేళ్లలో 9 కాలేజీలు అందుబాటు-లోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వెనకబడిన ప్రాంతాల ప్రజలకు మంచి వైద్యం అందిస్తామని సభలో మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

## యూదులకు రాష్ట్రపతి న్యూ ఇయర్ శుభాకాంక్షలు


**న్యూఢిల్లీ,సెప్టెంబర్23( తెలుగు రేఖ):**
మంగళవారం యూదుల నూతన సంవత్సరమైన 'రోష్ హషానా' సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూదు సమాజానికి, ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కి భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం యూదులందరికీ శాంతి,



శ్రేయస్సు, మంచి ఆరోగ్యంతో నిండిన సంవత్సరం కావాలని ముర్ము ఆకాంక్షించారు. ఈమేరకు ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. సోమవారం ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుకి ప్రధాని నరేంద్ర మోడీ రోష్ హషానా సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. విదేశాంగ శాఖా మంత్రి ఎస్. జైశంకర్ ఇజ్రాయిల్ విదేశాంగ శాఖామంత్రి గిడాన్ సార్‌కి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# 120 ఏళ్లలో తినాల్సింది 40 ఏళ్లలోనే లాగించేస్తున్నాం

**అందుకే అనారోగ్యాల బారిన పడుతున్నాం**
**ఇది మీకు కూడా వర్తిస్తుంది అధ్యక్షా..!**
**సభలో నవ్వులు పూయించిన చంద్రబాబు**
**ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక**



**అమరావతి,సెప్టెంబర్23( తెలుగు రేఖ):**
వైద్యారోగ్యశాఖపై చర్చకు సమాధానం ఇచ్చిన సందర్భంగా సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో నవ్వులు పూయించాయి. మనిషి సగటు- వయసు 120 ఏళ్లు.. కానీ, 40 ఏళ్లలో 120 ఏళ్లకు తినాల్సిన ఆహారాన్ని తినేస్తున్నాం. అది మీక్కూడా వర్తిస్తుంది అధ్యక్షా.. అంటూ ఉపసభాపతి రఘురామకృష్ణను ఉద్దేశించి చంద్రబాబు నవ్వుతూ వ్యాఖ్యానించారు. దీంతో ఎమ్మెల్యేలతో పాటు- ఉపసభాపతి సైతం నవ్వులు చిందించారు. అనంతరం చంద్రబాబు ప్రజారోగ్యంపై కీలక ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య డేటా ప్రభుత్వం వద్ద ఉండేలా చర్యలు చేపడుతున్నాం. రెండో బిడ్డని వద్దనుకొనేవారు క్రమంగా పెరుగుతున్నారు. ప్రతి ఒక్కరికీ 41 రకాల వైద్య పరీక్షలు చేయించి హెల్త్ రికార్డు నమోదు చేస్తాం. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ రూ.2.5లక్షల ఆరోగ్యబీమా కల్పిస్తున్నాం అని సీఎం తెలిపారు. 'ఆహారమే ఔషధం.. వంటశాలే ఫార్మసీ' అనేది ప్రతిఒక్కరూ పాటించాని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అనారోగ్య కారణాలతో ప్రధాని మోదీ, తాను ఎప్పుడూ సెలవు తీసుకో లేదన్నారు. కావాల్సిన దానికంటే ఎక్కువ తినేయడం వల్లే అనారోగ్యాలు వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ జీవన విధానం మార్చుకోవాలి. పంచదార, ఉప్పు, వంట నూనెలను వీలైనంత వరకు తగ్గించుకోవాలి. ప్రశాంతంగా జీవించడం 8గంటలు నిద్రపోవడం అందరికీ తప్పనిసరి. ఆస్పత్రుల్లో చికిత్సకంటే రూమ్‌ల ధరలు ఎక్కువగా పెరిగిపోయాయన్నారు. 'కొందరు ఫిజికల్‌గా కనబడరు. కానీ, ఆరోగ్య సమస్యలుంటాయి. నేను 1997లో పోలీసులను చూసి ఎవరికైనా పొట్ట ఉంటే వెంటనే వెళ్లి వ్యాయామం చేయాలి.. ఇంకోసారి ఇలా కనిపిస్తే వదిలిపెట్టనని చెప్పేవాణ్ని. చాలా మంది వైద్యులూ పేషెంట్లే. వారికి ఉండే నాలెడ్జ్‌ని వేరేవాళ్లకు షేర్ చేస్తారు తప్ప ఆచరించని వారు ఉంటారు. ఎమ్మెల్యేలు ముందు ప్రాక్టీస్ చేయండి. పోషకాహారం మితంగా తినండి. ఎక్కువ రోజులు ఆనందంగా ఉండండి. బతికినంత కాలం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలనేదే నా కోరిక. ఇంటికి వెళ్లి ఆనందంగా నిద్రపోండి. ఉదయం ఎన్ని పనులు ఉన్నా.. 45 నిమిషాలు లేదా గంట పాటు- యోగా, వ్యాయామమైనా చేయండి. హార్డ్ వర్క్‌వద్దు. స్మార్ట్ వర్క్ చేయండి. ఇప్పుడంతా వర్చువల్. చేసే పని పాజిటివ్‌గా చేయండని సూచించారు. సభలో సీఎం ప్రసంగం అనంతరం ఉపసభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. భగవంతుడు ఇచ్చిన 120 ఏళ్ల ఆయుర్ధాయం దిశగా ఆరోగ్యాంధ్రప్రదేశ్ తప్పకుండా ముందుకెళ్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. నాకు ఇచ్చిన సూచనల్ని కూడా తప్పకుండా పాటిస్తా. కాకపోతే కొంచెం ఆలస్యంగా చెప్పారు. మా అచ్చెన్నాయుడు గారు, నేను పాటిస్తాం అని సరదాగా అన్నారు.అనంతరం ఉపసభాపతి సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు- ప్రకటించారు.

Printed and Published by V. SHANKARA SHARMA, H. NO-9-18/7, KRISHNANAGAR, VILLAGE BOMMAKAL, MANDAL & DISTRICT-KARIMNAGAR TELANGANA-505001, RNI No. TELTEL/2010/31853, Editor: Eldi Ravinder, telugurekha1984@gmail.com, 9963197573.